క్లుప్తంగా

శ్రీవారి సేవలో మంత్రి కొప్పుల కుటుంబం



ఆలయ ప్రాంగణంలో మంత్రి కుటుంబ సభ్యులు

ధర్మపురి: దైవ దర్శనంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ భార్య స్నేహలత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తిరుపతిలోని కలియుగ దైవమైన శ్రీ ఏడుకొండల వెంకటేశ్వర స్వామిని శుక్రవారం మంత్రి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం చిత్తూరు జిల్లాలోని కానిపాకంలోని వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 9, 10 వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయికల్ పట్టణంలోని అన్ని వార్డుల్లోని మురికికాలువల్లో చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ మ్యాకల కాంతారావు ఉన్నారు.

మన ఊరు - మన బడి పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

ఇబ్రహీంపట్నం: మన ఊరు మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ కోరారు. శుక్రవారం మండలంలోని కోజన్‌కొత్తూర్ పాఠశాలలో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభించేలోగా పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను, నర్సరీని పరిశీలించారు. వర్మి కంపోస్ట్ షెడ్‌లో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి వేసి ఎరువులను తయారు చేయాలని జీపీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌బీఐ సర్వీస్ సేవలు వినియోగించుకోవాలి



ఎస్‌బీఐ సర్వీస్‌పాయింట్ వద్ద గ్రామస్తులు

రాయికల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌బీఐ రాయికల్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ప్రహ్లాద్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం కట్కాపూర్‌లో ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సర్వీస్ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వీస్ పాయింట్‌ను చుట్టుపక్కల గ్రామస్తులు, వీడీసీ సభ్యులు, మహిళ సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కట్కాపూర్, తాట్లవాయి సర్పంచ్‌లు రాజమౌళి, రాగి సాగరిక ఎంపీటీసీ పద్మ, సుధాకర్, బీర్పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శివతేజ, మేనేజర్ గులాం నబీ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పర్మినెంట్ చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా శుక్రవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

బీమారం పీహెచ్‌సీకి గ్రీన్ సిగ్నల్

- ప్రభుత్వ నిర్ణయంతో మండల ప్రజల్లో సంతోషం
- గ్రామీణులకు అందుబాటులో ప్రభుత్వ వైద్యం



బీమారం గ్రామం ఏరియల్ వ్యూ

కథలాపూర్: పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త మండలాలు ఏర్పాటు చేయగా.. మేడిపెల్లి మండలంలోని బీమారం గ్రామాన్ని గతేడాది మండలకేంద్రంగా ప్రకటించారు. మండల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే మండలకేంద్రంలో 30 పడకలతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఐదు పల్లె దవాఖానలు

బీమారం మండలంలో 13 గ్రామాలుండగా.. 26,552 మంది జనాభా ఉంది. ఆయా గ్రామాల ప్రజలకు వైద్యం, గర్భిణులకు, చిన్నారులకు టీకాలు అందించేందుకు బీమారం, మన్నెగూడెం, గోవిందారం, దేశాయిపేట, వెంకట్రావుపేట గ్రామాల్లో పల్లె దవాఖానాలున్నాయి. ఈ ఐదింటిలో మన్నెగూడెం, గోవిందారం పల్లె దవాఖానాల్లో మాత్రమే వైద్యులుండగా.. మిగతా వాటిలో స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎంలతో వైద్యం అందిస్తూ నెట్టుకొస్తున్నారు.

తప్పనున్న దూర భారం

బీమారం మండల ప్రజలు ఇన్నాళ్లు ప్రభుత్వ వైద్యం కోసం మండల ప్రజలు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడిపెల్లికి వెళ్లాల్సిన పరిస్థితి. మెరుగైన ప్రభుత్వ వైద్యసేవల కోసం సుమారు 20 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు పోవాల్సిందే. ప్రత్యేక పరిస్థితుల్లో దూరం వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఆయా గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులుపడిన సందర్భాలున్నాయి. బీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటు కానుండటంతో మండలంలోని పేదప్రజలు పడుతున్న వ్యయప్రయాసలు దూరం కానున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుతో ప్రయోజనాలు..

బీమారం మండలంలోని గ్రామాలు మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల లోపే ఉన్నాయి. అత్యవసర సమయాల్లో మంచి వైద్యం అందుతుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఉచితంగా రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు చేసి మందులు అందించవచ్చు. గర్భిణులకు ప్రత్యే వైద్య సేవలు, డెలివరీ సమయంలో వైద్యుల పర్యవేక్షణ ఉండటంతో వారికి భరోసాగా ఉంటుంది. మాతా శిశు మరణాలను తగ్గించవచ్చు. ప్రమాదాలు జరిగినప్పుడు త్వరగా వైద్యం అందుతుంది. కుక్క, కోతుల కాటుకు గురైన వారికి సకాలంలో వైద్యం అందుతుంది.

ఇబ్బందులు తొలగిపోతాయి



కొత్తగా బీమారం మండలం ఏర్పాటు చేయడంతో మారుమూల గ్రామాల ప్రజలకు పాలనపరంగా సౌకర్యం కలిగినట్లయింది. ప్రభుత్వ వైద్యం గ్రామీణులకు అందుబాటులోకి వస్తే బాగుంటుందని ఏళ్లుగా ఎదురుచూస్తున్న తరుణంలో ప్రభుత్వం బీమారంలో 30 పడకలతో పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో సంతోషం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు పేదప్రజలు వైద్య సేవల కోసం పడిన ఇబ్బందులు తొలగిపోయినట్లే. పీహెచ్‌సీకి త్వరగా సొంత భవనం నిర్మించాలి.

– బొమ్మెన ప్రశాంత్, యువకుడు, బీమారం

పీహెచ్‌సీల్లో ఉన్నత వైద్యం



పీహెచ్‌సీల్లో వైద్యులు మంచి వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నాం. పల్లె దవాఖానాల్లో ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నాం. బీమారంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు చేస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం. మండల ప్రజలు పీహెచ్‌సీల్లో అందించే సేవలను వినియోగించుకోవాలి.

– ఎం.డీ సమియొద్దీన్, వైద్యశాఖ ప్రోగ్రామింగ్ ఆఫీసర్, జగిత్యాల

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్



బతుకమ్మలతో వస్తున్న ఎమ్మెల్యే, మహిళలు

మల్యాల: పల్లెల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని, సీఎం కేసీఆర్ పాలనలో సస్యశ్యామలమయ్యాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం మల్యాల మండలం బల్వంతాపూర్‌లో రూ.3.29కోట్ల విలువైన సీసీరోడ్డు, బీటీ రోడ్డు పనులకు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్‌కు బతుకమ్మలతో, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఘన స్వాగతం పలికారు. పల్లెల అభివృద్ధి కోసం ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. హరితహారం, పల్లె ప్రకృతి వనాలతో పల్లెలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువుల్లో పూడిక తీయడంతో చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, సర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీపీ లత, పాక్స్ చైర్మన్ రాంలింగారెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనే రోడ్లకు మహర్దశ

కొండగట్టు: మండలంలోని పూడూర్ నుంచి నర్సింహులపల్లి వరకు పంచాయతీ రాజ్‌రోడ్డు 2.19 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులకు, కొడిమ్యాల, చెప్యాల గ్రామాల్లో పల్లె దవాఖానాలకు శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రశాంతి, ఎంపీపీ ఎం.స్వర్ణలత సర్పంచ్‌లు ఏలేటి మమత, పునుగోటి కృష్ణారావు, పెద్ది కవిత, బోడ్డు విజయలక్ష్మి, ఏగుర్ల తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ ఎం.రాజనర్సింగరావు పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు



రాయికల్: మండల ఎస్సైగా అజయ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కిరణ్‌కుమార్ జగిత్యాల వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

బుగ్గారం ఎస్సై సందీప్..

బుగ్గారం: మండల ఎస్సైగా సందీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇంతకముందు ఎస్సైగా ఉన్న అశోక్ బదిలీపై మల్యాలకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జగిత్యాల టౌన్ ఎస్సైగా పనిచేసిన సందీప్ బుగ్గారం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైకి సన్మానం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సదాకర్‌ను శుక్రవారం సాయంత్రం తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

నూతన వసతి గృహాల నిర్మాణానికి నిధులు మంజూరు

ధర్మపురి/ పెగడపల్లి: గత కొన్నేళ్ల నుంచి అద్దె భవనాల్లో ఉంటూ ఇబ్బందులు పడ్డ విద్యార్థులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎస్సీ నూతన వసతి గృహాల నిర్మాణం కోసం 4 కోట్ల రూ.ల నిదులు మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. ధర్మపురితో పాటు పెగడపెల్లి మండల కేంద్రాల్లో ఎస్సీ వసతి గృహాల నిర్మాణం కోసం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో నిదులు మంజూరయ్యాయి. వసతి గృహాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన మంత్రి ఈశ్వర్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో యువతీయువకుల్లో ఐక్యత



క్రీడాకారులను సన్మానిస్తున్న ఎస్సై, నాయకులు

సారంగాపూర్: క్రీడలతో యువతీ యువకుల్లో ఐక్యత పెరుగుతుందని ఎస్సై మనోహర్‌రావు, ప్రజాప్రతినిధులు అన్నారు. శుక్రవారం మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు ఇటీవల జరిగిన సీఎం కప్ వాలీబాల్ క్రీడల్లో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. వీరితో పాటు గ్రామానికి చెందిన రెవెళ్లి గంగాధర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడకు ఎంపిక కావడంతో వీరిని గ్రామానికి చెందిన సీనియర్ టీఆర్‌ఎస్ నాయకుడు తేలు రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తేలు రాజు, రైతుబంధు అధ్యక్షుడు బాదినేని వెంకటేశ్, బండారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ నరేంద్రకు ఎమ్మెల్సీ నివాళి

మెట్‌పల్లి: మండలంలోని ఆత్మనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తులసీ నరేంద్ర మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డితో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఆనంద్‌రావు, చిన్నయ్య, గాదె నర్సింగరావు తదితరులు పట్టణంలో ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

హుస్సేన్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్: మండలంలోని హుస్సేన్‌నగర్‌లో శుక్రవారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ డిపార్ట్‌మెంట్ జారిచేసిన గుర్తింపు కార్డు ఉన్న కార్మికులకు శిబిరంలో 50 రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ హైదర్, మెట్‌పల్లి లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి కే అనిల్, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు ఉస్మాన్, రాంబాబు, పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో రాయితీ విత్తనాలు



ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ అంకతి రాజన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు కనక నాగేశ్, క్యాంతం తిరుపతి, సీఈవో నేమూరి మహేందర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కట్లకుంటలో ఇంటింటా ఆరోగ్యసర్వే

కథలాపూర్: మేడిపెల్లి మండలం కట్లకుంటలో కరీంనగర్‌కు చెందిన చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా ఆరోగ్య సర్వే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారంరోజుల పాటు గ్రామంలో ఆరోగ్య సర్వే చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం నారాయణరెడ్డి, ఎంపీటీసీ పన్నాల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గుల్లకోట ఎంపీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

వెల్గటూర్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం విడుదలైన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 12 మంది ఎంపికై సత్తా చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను హెచ్‌ఎం చందూరి రాజిరెడ్డి, పలువురు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న ఏవో లావణ్య

మల్లాపూర్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు గడించే అవకాశం ఉంటుందని, ఈ విషయమై రైతులకు సరైన అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటలో ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఈవోలు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి ఆయిల్‌పామ్ సాగుకు సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల నాగరాజు, ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, ఉపసర్పంచ్ సామ రవి, ఎఈవో, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో రూ.5 లక్షల జెడ్పీ నిధులతో చేపట్టే బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులకు, ఎంపీ దామోదర్‌రావు మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో నిర్మించే డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను పట్టణాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ కవిత సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ నిర్మించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలో గతంలో తీసుకువచ్చిన మాస్టర్ ప్లాన్‌ను సమీప గ్రామాల ప్రజలు వ్యతిరేకించడంతో రద్దు చేశామని, వారం రోజుల్లో జీవో రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రెండో విడత కంటి వెలుగును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, సర్పంచ్ గడ్డం సరోజన, ఎంపీటీసీ మహేశ్, మాజీ సర్పంచ్ నరేశ్, నాయకులు రాజనర్సయ్య, లక్ష్మణ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

గ్రామగ్రామాన మురికికాలువల నిర్మాణం

గ్రామాల్లో ప్రతి కాలనీలో మురికికాలువలు నిర్మిస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో జెడ్పీనిధుల నుంచి మంజూరైన 15వ ఆర్థిక సంఘం రూ.4.40 లక్షలతో నిర్మించే డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, ఎంపీటీసీ స్వప్న, నాయకులు సతీశ్, శ్రీనివాస్, నారాయణగౌడ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఈ రాజమల్లయ్య, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

జగిత్యాల: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గోత్రాల కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల మున్సిపాలిటీకి అత్యధిక నిధులు కేటాయించడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో కన్నా వందరేట్లు మెరుగ్గా పనులు జరిగాయని పేర్కొన్నారు. జగిత్యాలలో అన్ని వసతులతో కూడిన కార్పొరేట్ వైద్యం, విద్య, అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లవ్వ, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

కేంద్రం పథకాలు ఇంటింటా వివరించాలి



జెండా ఆవిష్కరణలో నాయకులు, కార్యకర్తలు

కథలాపూర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి అన్నారు. శుక్రవారం మేడిపెల్లి మండలకేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్లలో దేశంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా అందరు పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎస్ ఎన్ రెడ్డి, అన్నాడి జలపతిరెడ్డి, మేకల రాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

కథలాపూర్: రాష్ట్రంలో అవినీతిమయమైన కల్వకుంట్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ ప్రణాళిక మండల బాధ్యుడు బండ మల్లేశం ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం కథలాపూర్ మండలకేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ, బాలింతలకు పోషకాహార కిట్లు అందిస్తున్నారన్నారు. పేద ప్రజలకు ఉచితంగా అందించే రేషన్‌బియ్యంలో కేంద్రం వాటా ఉందనే విషయాన్ని ప్రజలకు వివరించాలిసిన బాధ్యత బీజేపీ కార్యకర్తలదేనన్నారు. కేంద్రం అందించే పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాలు తుల ఉమ, కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, కంటె సత్యనారాయణ, ఎద్మల వినోద్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, అజయ్‌రావు,తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలి

ఇబ్రహీంపట్నం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బట్టు జకరయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మహజన్ సంపార్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు మండలంలోని అన్ని బూత్‌లలోకి ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి 20 మందిని కలిసి మోదీ చేపట్టిన అభివృద్ధి పనుల గురించి తెలపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు తీగల శ్రీధర్‌రెడ్డి, జిల్లా కిషాన్‌మోర్చా కార్యవర్గ సభ్యులు బైన మహేశ్, మండల ప్రధాన కార్యదర్శులు రణదీర్, వై.బాలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకపోవాలి

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకపోవాలని బీజేపీ ఇన్‌చార్జి శీలం వేణు సూచించారు. పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో శుక్రవారం పట్టణ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 30 నుంచి జూన్ 30 వరకు జన సంపర్క్ అభియాన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు బొడ్ల రమేశ్ నాయకులు గుంటుక సదాశివ్, చెట్లపల్లి మీనా, గంప శ్రీనివాస్, మిట్టపల్లి సాయి, బొడ్ల నరేశ్, లోలపు అనిల్, కలికోట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి కార్యకర్తలే ప్రధాని మోదీ బలం

మల్లాపూర్: గ్రామాలు, పట్టణాల్లోని బూత్‌స్థాయి కార్యకర్తలే ప్రధాని నరేంద్రమోదీ బలమని, వారి కృషితోనే కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రధాని మోదీ అధికారం చేపట్టనున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ వ్యవస్థను నాశనం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో తమ పంటలను అమ్ముకోవడానికి, కనీస మద్దతుధరలను పొందడానికి రైతులు ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ పాలనా వైఫల్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే దుస్థితికి తీసుకు వచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలో రావడానికి కార్యకర్తలు పనిచేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గసభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుయ్య శ్రీశైల మల్లేష్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బోరుబావి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్, ఎంపీపీ

కథలాపూర్: మండలంలోని కలిగోట గ్రామశివారులో గౌడ సంఘంకు చెందిన ఈతచెట్ల వద్ద బోరుబావి పనులను శుక్రవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ బోరుబావి కోసం మండల పరిషత్ నిధులు రూ. 1.50 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచులు గంగప్రసాద్, గంగారెడ్డి, డైరెక్టర్ గంగారావు, నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి మండలం కల్వకోటలో..

కథలాపూర్: మేడిపెల్లి మండలం కల్వకోటలో ఈద్గా వద్ద బోరుబావి పనులను జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ బోరుబావిని మండల పరిషత్ నిధుల నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, సర్పంచ్ ఆదె హన్మక్క, ఎంపీటీసీ ఆదె రాజన్న, ఉపసర్పంచ్ రాజేందర్, ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.